

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.23 కోట్లు
- వివరాలు 7లో



ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు అభినందన

జనసేన ఎమ్మెల్యేలకు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సన్మానం

జనసేన తరపున ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వారిని మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం ఘనంగా సన్మానించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌లకు ఆయన శాలువాలు కప్పి అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని సూచించి పలు ముఖ్య అంశాలపై జనసేనాని దిశానిర్దేశం చేశారు. పి.గన్నవరం/రాజోలు



ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు అభినందన

నిబంధనలకు లోబడి అర్జీలను పరిష్కరించండి: కలెక్టర్ మహేష్‌కుమార్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఉప్పలగుప్తం, జూలై 15: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీకి నిబంధనలకు లోబడి తక్షణం పరిష్కారం చూపించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. చల్లపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టుకు గతంలో ఉన్న డైరెక్ట్ విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించి, తాగు నీటి కష్టాలను తొలగించాలని సన్నవిల్లి సర్పంచ్ చిక్కం జంగమయ్య కలెక్టర్‌ను అభ్యర్థించారు. శిథిలస్థితికి చేరిన నూరు వసంతాల గొల్లవిల్లి మెయిన్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పునర్నిర్మించాలని ఆరిగెల నానాజీ ఆధ్వర్యంలో కూటమి నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఎస్.యానాం రవ్వ యాజమాన్యం గ్రామస్తులకు ఉద్యోగాల కల్పన, గ్రామాభివృద్ధి హామీలను నెరవేర్చాలని దళిత ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివిధ అంశాలకు సంబంధించి మొత్తం 69 ఫిర్యాదులు అందినట్టు ఎంపీడీవో కొఠారి వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, తహసీల్దారు మల్లికార్జునరావు, పంచాయతీరాజ్ డీఈఈలు రాజ్‌కుమార్, అన్యం రాంబాబు, వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దరఖాస్తుకు

గడువు పొడిగింపు

ముమ్మిడివరం, జూలై 15: ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 18వ తేదీ వరకు పొగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి సోమవారం తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేయాలన్నారు. ఉపాధ్యాయులంతా ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఆగస్టు 31వ తేదీలోపు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో కోరారు. 2020-21-22 సంవత్సరాల్లో ఎంపికైన విద్యార్థులు కూడా తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలని ఆమె సూచించారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకునే విద్యార్థులు తప్పనిసరిగా వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. ఫేస్ ఆథరైజేషన్‌ను తమ మొబైల్ ఫోన్ ద్వారా గానీ, ఇతర ఫోన్ల ద్వారా గానీ పూర్తి చేసుకోవాలన్నారు. ఆ తర్వాత విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని డీఈవో సూచించారు.

జీపీఎస్ ఉత్తర్వులను ఉపసంహరించకుంటే ఉద్యమిస్తాం

ఎస్టీయూ జిల్లా శాఖ హెచ్చరిక

అమలాపురం టౌన్, జూలై 15: జీపీఎస్ విధానాన్ని అమలుచేస్తూ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు హెచ్చరించారు. గత ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీని తుంగలో తొక్కి జీపీఎస్‌ను అమలులోకి తెచ్చిందని విమర్శించారు. జీపీఎస్ కన్నా మెరుగైన విధానాన్ని తెస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా గత ప్రభుత్వం తెచ్చిన జీపీఎస్‌ను యథావిధిగా అమలు చేస్తామని గెజిట్ విడుదల చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఉద్యోగ సంఘాలతో తక్షణం చర్చలు జరపాలని డిమాండు చేశారు. జీపీఎస్ విధానంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరో పోరాటానికి శ్రీకారం కుట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం తప్ప మరే ప్రత్యామ్నాయాన్నీ ఎస్టీయూ పక్షాన అంగీకరించమని స్పష్టం చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను కలుసుకుని ఎస్టీయూ పక్షాన గెజిట్ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని కోరతామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపాలని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్ కోరారు.



బండారులంకలో గుర్రపుడెక్కతో పూడుకుపోయిన అప్పర్ కౌశిక మేజర్ డ్రెయిన్

పంట కాల్వలకు మహర్దశ!

- గుర్రపుడెక్కతో నిండిపోయిన మేజర్ డ్రెయిన్లు
- అస్తవ్యస్తంగా సాగునీటి సరఫరా
- పూడికతీత పనులకు రూ.3.81 కోట్లు మంజూరు
- మళ్లీ తెరపైకి సాగునీటి సంఘాలు

అమలాపురం రూరల్, జూలై 14: గత వైసీపీ పాలనలో పంట కాల్వలు, మేజర్ డ్రెయిన్ల నిర్వహణపై పూర్తి నిర్లక్ష్యం వహించారు. ఒక్కో దశలో ఖరీఫ్ సాగుకు వెళ్లలేని పరిస్థితిపై రైతులు రోడ్డెక్కిన సందర్భాలూ వున్నాయి. అయినా అదిచేస్తాం... ఇది చేస్తాం... అంటూ డ్రైనేజీ వ్యవస్థను పట్టించుకోలేదు. డ్రోన్ల ద్వారా రసాయనాలు పిచికారీ చేసి గుర్రపుడెక్క తొలగించేందుకు అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి-బండారులంక మధ్యనున్న అప్పర్ కౌశిక మేజర్ డ్రెయిన్‌పై 2022 జూన్ 22న ట్రయల్ రన్ నిర్వహించారు. ఇదే నమూనాను అన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పారు. పిచికారీ చేసిన తర్వాత వర్షం కురవడంతో అది కాస్తా ఫెయిల్ అయింది. మళ్లీ డ్రోన్ల జాడే కనిపించలేదు. ఇక పంట కాల్వలు, డ్రెయిన్లు ఆక్రమణలకు గురికావడమే కాకుండా కొన్ని ప్రాంతాల్లో రెవెన్యూ డ్రెయిన్లు, పంటబోదెలు కనిపించకుండా పోయాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సాగునీటి కాల్వలతో పాటు ముంపు సమస్యను అధిగమించేందుకు చర్యలు చేపట్టింది. జిల్లాలోని మేజర్ డ్రెయిన్లలో పూడికతీత పనులకు రూ.3.81 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దీనికి సంబంధించి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. టెండరు ప్రక్రియ పూర్తిచేసి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు.

ఉపాధి హామీతో అనుసంధానం...

పంట కాల్వల్లో గుర్రపుడెక్క, తూడు పేరుకుపోవడం, చెత్తాచెదారాలతో నిండిపోవడంతో సాగునీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. ఈ పరిస్థితుల్లో మైనరు డ్రెయిన్లు, పంటకాల్వలు, పంట బోదెల్లో నీటి ప్రవాహానికి ఎటువంటి అవరోధాలు లేకుండా ఉపాధి హామీ పథకంలో పూడికతీత పనులు చేపట్టాలని డ్వామా పీడీ ఎస్.మధుసూదన్‌కు కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దాంతో పలుచోట్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శివారు ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితులపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కుమ్మరికాల్వ మేజర్ డ్రెయిన్, అప్పర్ కౌశిక, లోయర్ కౌశిక మేజర్ డ్రెయిన్లు గుర్రపుడెక్క, తూడుతో పూర్తిగా నిండిపోయాయి. గత ఐదేళ్ల కాలంలో తూతూమంత్రంగానే పనులు చేపట్టడంతో వేలాది ఎకరాల ఆయకట్టుకు అనుసంధానంగా ఉన్న మేజర్ డ్రెయిన్లు పూడుకుపోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో గోదావరికి కొద్దిపాటి వరదలు వచ్చినా పంట పొలాలు ముంపు బారిన పడే ప్రమాదం ఏర్పడింది. కుమ్మరి కాల్వ మేజర్ డ్రెయిన్ అయినవిల్లి మండలం నుంచి అమలాపురం మీదుగా అల్లవరం వరకు ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. కుమ్మరికాల్వ డ్రెయిన్ పి.గన్నవరం మండలంలో ముంజవరపు కొట్టు వద్ద గోదావరి నుంచి ఆటుపోట్ల ద్వారా ముందుకు సాగుతుంది. ఇక ప్రధానమైన వాసాలతిప్ప మేజర్ డ్రెయిన్ ఉప్పలగుప్తం మండలంలో సముద్రంలో కలుస్తుంది. అయితే వాసాలతిప్ప మేజర్ డ్రెయిన్‌కు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంతో పాటు పూడికతీత పనులు చేపట్టడం వల్ల ప్రస్తుతం అంతగా ముంపు సమస్య లేదు.

పంట కాల్వలను సకాలంలో బాగు చేయడంతో పాటు రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా చూసేందుకు గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో రైతులకు ఏ సమస్య వచ్చినా సాగునీటి సంఘాలు బాధ్యతగా పనిచేసి వారికి ఇబ్బందులు లేకుండా చూసేవారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని రద్దు చేశారు. ప్రస్తుతం అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంటకాల్వను వేలాది ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. వైసీపీ పాలనలో ప్రధాన పంట కాల్వను పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడ తూడు పెరిగిపోయి సాగునీటి ప్రవాహానికి అవరోధంగా మారాయి. రైతుల ఆధ్వర్యంలో సాగునీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు మట్టా మహాలక్ష్మి ప్రభాకర్ ప్రభుత్వంతో పాటు కలెక్టర్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. సాగునీటి సంఘాలతోనే పంట కాల్వలకు మహర్దశ పడుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలను పునరుద్ధరించడం ఖాయమని ఆయా పార్టీల నాయకులు చెప్తున్నారు. గతంలో అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అమలాపురం, చల్లపల్లి, అల్లవరం నీటి పంపిణీ సంఘాలు ఉండేవి. వాటి ఆధ్వర్యంలో ఒక్కో సంఘం పరిధిలో 5 నుంచి 10 సాగునీటి సంఘాలు పూర్తి బాధ్యతాయుతంగా పనిచేసేవి. సాగునీటి సంఘాలను పునరుద్ధరించడం ద్వారా పొలిటికల్ ఎంప్లాయిమెంట్ కూడా దొరుకుతుంది.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ నుపూర్‌అజయ్

సమస్యల పరిష్కారంలో నిర్లిప్తత వహిస్తే

చర్యలు తప్పవు

- జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 160 అర్జీలు

అమలాపురం టౌన్, జూలై 15: సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లిప్తత వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ హెచ్చరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మెరుగైన రూపమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక అని ఆమె పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కచ్చితమైన వివరణతో పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 160 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి ఇ.నారాయణమూర్తి, కార్పొరేషన్ చైర్మన్ వై.శ్రీరామ్, డీఆర్డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, డీఈవో ఎం.కమలకుమారి, డీఎస్‌వో ఎ.పాపారావు, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.



ముంపునీరు దిగక పంట కోల్పోతున్నాం

పల్లంకుర్రు లైనుపేట రైతులు

కాట్రేనికోన మండలం పల్లంకుర్రు శివారు లైనుపేట సీతమ్మ డ్రైనేజీని ఆనుకుని 300 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాం. ముంపు నీరు దిగే డ్రెయినేజీ ఆక్రమణలకు గురికావడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో మూసేశారు. గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలతో ముంపు నీరు దిగక వేసిన నారుమడులు కుళ్లిపోయాయి. మళ్లీ నారుమడులు వేసి పంట సాగు చేయాలన్నా ముంపు నీరు దిగని పరిస్థితి. ఇప్పటికే గత రెండేళ్లుగా ముంపు నీరు దిగే పరిస్థితి లేకపోవడంతో మొదటి పంటను విరమించుకున్నాం. ఈసారైనా ముంపునీరు దిగేలా చర్యలు తీసుకుని మొదటి పంట విరామం నుంచి కాపాడాలని రైతులు ఇసుకపట్ల గోవిందు, ఇసుకపట్ల శ్రీరామమూర్తి తదితరులు వేడుకున్నారు.



పాత విధానంలోనే ప్రాథమిక విద్య ఉండాలి

సాకుర్రు గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లులు

ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వం విలీనం చేసింది. దీనివల్ల విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక పాఠశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గతంలో మాదిరిగానే 1 నుంచి 5 తరగతులను ప్రాథమిక పాఠశాలలో కొనసాగించాలి. ప్రాథమిక పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అన్నీ ఉన్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి గతంలో మాదిరిగానే ప్రాథమిక విద్యను కొనసాగించాలని ఎం.కుమారి, ఈతకోట నాగలక్ష్మి, పి.లక్ష్మీప్రసన్న, ఎం.సోని, డి.సుబ్రహ్మణ్యేశ్వరి అర్జీ అందించారు.

భూమి రికార్డులు మాయం చేశారు

గొలకోటి అమ్మిరాజు, మోడేకుర్రు, కొత్తపేట మండలం



అమలాపురం రూరల్ మండలం తాండవపల్లిలో సర్వే నెం.138/6లో 50 సెంట్ల స్థలం ఉంది. దీనికి సంబంధించి దస్తావేజులతో పాటు అన్ని రికార్డులు ఉన్నాయి. ఈ భూమిని గ్రామానికి చెందిన వ్యక్తికి లీజుకు ఇచ్చా. మూడేళ్ల క్రితం వరకు 1(బి) రికార్డుల్లో నా పేరే ఉంది. ఇప్పుడు కనీసం ఆ భూమి వివరాలు కూడా ఆన్‌లైన్‌లో చూపించట్లేదు. ఆ భూమిని సర్వే చేయించి అప్పగించాలని గతంలో నిర్వహించిన స్పందనలో పలు పర్యాయాలు అర్జీలు అందించాను. ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదు. సర్వే చేయించి భూమిని అప్పగించి ఆదుకోవాలి.



ఉద్యోగం ఇప్పించండి

నవుండ్రు మంగాదేవి, దివ్యాంగురాలు, యెంట్రుకోన

పుట్టుక నుంచే దివ్యాంగురాలిని. తండ్రి లేడు. తల్లి వద్దే ఉంటున్నా. ఇంటర్మీడియట్ చదువుకున్నా. దివ్యాంగుల కోటాలో ఏదో ఒక చిన్న ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలి.

ఎస్పీ కార్యాలయంలో 13 ఫిర్యాదులు

అమలాపురం టౌన్, జూలై 15: సమస్యలను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఎస్.శ్రీధర్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఆయన 13 ఫిర్యాదులు స్వీకరించారు. సివిల్ వివాదాలు మూడు, కుటుంబ కలహాలు 1, ఇతర సమస్యలపై తొమ్మిది అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదిక సమర్పించాలని ఎస్పీ ఆదేశించారు.

ఉచిత విధానంలో 16వేల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయం

- జిల్లాలో 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు
- ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబరు 1800-4256021
- జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఉచిత విధానం ద్వారా ఇప్పటివరకు జిల్లాలో 16వేల మెట్రిక్ టన్నుల ఇసుకను విక్రయించినట్టు కలెక్టర్, జిల్లా ఇసుక కమిటీ అధ్యక్షుడు ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆరు స్టాక్ పాయింట్లలో 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయన్నారు. గోదావరి నదీ తీరంలో అనువైన ఇసుక రీచ్‌లను గుర్తించాలని కమిటీ సభ్యులకు సూచించారు. తీర ప్రాంత పరిధిలో ఉన్న రీచ్‌లను మ్యాపింగ్ చేసి నివేదిక రూపొందించాలన్నారు. సెలనిటీ ఉన్న రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వరాదన్నారు. ఇసుక రీచ్‌ల ద్వారా స్టాక్‌పాయింట్లకు చేరుతున్న ఇసుక పరిమాణం, విక్రయాలపై అధికారులను ఆరా తీశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా స్టాకు పాయింట్ల వద్ద వాహనాలు దిగబడి అదనపు ఖర్చులు అవుతున్నాయని ఆర్డీవోలు కలెక్టర్‌కు వివరించారు. అదనపు ఖర్చు వివరాలను కమిటీ సభ్యులు చర్చించి మెట్రిక్ టన్నుకు ఎంత అదనంగా అవుతుందో విభజించి వినియోగదారుల నుంచి వసూలు చేయాలని కమిటీ తీర్మానించింది. సీసీ కెమెరాల నిఘాతో పాటు డిజిటలైజేషన్ అమ్మకాల పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద నుంచి కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటర్ల ప్రాతిపదికన రవాణా చార్జీల సీలింగ్‌ను నిర్దేశించాలని జిల్లా రవాణాధికారులను ఆదేశించారు. ఇసుక సరఫరాలో ఉత్పన్నమయ్యే ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబరు 1800- 4256021 ఏర్పాటు చేశామన్నారు. ఇసుక తరలింపులో సెక్యూరిటీపరంగా వాటర్ స్ప్రేయింగ్, టార్పాలిన్ల ఏర్పాటు వంటి అంశాలను సంబంధిత అధికారులు పటిష్టంగా చేపట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సమావేశమై ఇసుక ఉచిత విక్రయానికి సంబంధించి ఏజెన్సీల ఎంపిక, అపరాధ రుసుము విధింపు, ఇసుక పరిమాణం, కొలతలు తదితర అంశాలను చర్చిస్తారన్నారు. స్టాకు యార్డులో 24 గంటలు నిఘా కొనసాగుతుందన్నారు. ఇసుక తరలింపులో లారీ యూనియన్ అసోసియేషన్ల ప్రమేయం లేకుండా చూడాలని ఆదేశించారు. ఇసుక పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, ఆర్డీవోలు ఎస్.సుధాసాగర్, జీవీవీ సత్యనారాయణ, జిల్లా ఖనిజాభివృద్ధి అధికారి సాయిరామ్‌సింగ్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ వి.సుజాత, కాలుష్య నియంత్రణా మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ సందీప్‌రెడ్డి, గోదావరి హెడ్‌వర్క్స్ కాశీవిశ్వేశ్వరరావు, డీపీవో డి.రాంబాబు, జిల్లా రవాణాధికారి అశోక్‌ప్రతాప్‌రావు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

భీమేశ్వరునికి ఇక జలాభిషేకమే!

పంచామృతాలు, పండ్ల రసాలు వద్దు

పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్ట్ ఉత్తర్వులు

పూర్తి అయిన మూలవిరాట్ సంరక్షణ పనులు



సూచనలిస్తున్న అధికారులు



ద్రాక్షారామ, జూలై 15 :ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి జలాలతోనే అభిషేకాలు నిర్వహించాలని కేంద్ర పురావస్తుశాఖ సైన్స్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. పాలు, పెరుగు, తేనె, గంధం, కొబ్బరినీరు, గంధం, పండ్ల రసాలు వంటి ద్రవ్యాలతో శివలింగానికి అభిషేకాలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ఇటీవల చేపట్టిన మూలవిరాట్ సంరక్షణ పనులు కేంద్ర పురావస్తుశాఖ పూర్తి చేసింది. మూలవిరాట్ సంరక్షణకు కొన్ని సంరక్షణ చర్యలు అమలు చేయాలని కేంద్ర పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

కల్తీ ద్రవ పదార్థాలతో నష్టం

స్వామివారి అభిషేకానికి గత రెండు దశాబ్దాల కాలంగా ప్యాకెట్ పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, పండ్ల రసాలు ఇతర ద్రవ్యాల వినియోగం పెరిగిపోయింది. పరిమితి లేకుండా ద్రవ పదార్థాలు వినియోగిస్తున్నారు. ద్రవ పదార్థాల్లో ఉన్న యాసిడ్ ఇతర రసాయనాలతో మూల విరాట్ రూపం దెబ్బతింది. దీంతో గతంలో 2011లో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఆలయంలో మూలవిరాట్ సంరక్షణ పనులు నిర్వహించారు. అప్పట్లో కూడా పలు సంరక్షణ చర్యలు పురావస్తుశాఖ అధికారులు సూచించారు. అయితే ఆలయ అర్చకులు, పురోహితులు, భక్తులు, అధికారులు వీటిని పట్టించుకోలేదు. దీంతో ప్రస్తుతం మరోసారి మూలవిరాట్‌కు సంరక్షణ చర్యలు చేపట్టాల్సి వచ్చింది.

ఇవీ చేపట్టాల్సిన జాగ్రత్తలు

స్వామిమూలవిరాట్ సంరక్షణకు పురావస్తు సైన్సు విభాగం పలు సూచనలు చేసింది. స్వామివారి అభిషేకానికి స్వచ్ఛమైన జలాలు వాడాలని సూచించారు. పాలు, పెరుగు, నెయ్యి, నూనెలు, కొబ్బరినీరు, తేనె, అరటిపండ్లు గుజ్జు, పంచదార, గంధం పౌడరు, కంకుమ, పండ్లు, పండ్ల రసాలు వినియోగించవద్దని సూచనలు చేశారు. మూలవిరాట్‌ను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛమైన గాలి వీచేలా ఉంచాలని అందుకు ఎగ్జాస్ట్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, జలాలతో అభిషేకించిన తర్వాత మెత్తటి వస్త్రంతో మూలవిరాట్‌ను తుడవాలని, వారానికి ఒక సారి నాన్ అయోనిక్ డిటర్జంట్‌తో శుభ్రపరచాలని, క్యామెల్ బ్రష్‌లు వినియోగించాలని ఆదేశాలు ఇచ్చారు. నిమ్మ, వెనిగర్ వంటి యాసిడ్ ఉన్న ద్రవాలతో మూలవిరాట్ రంగు మారిపోతుందని పురావస్తుశాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భక్తుల మనోభావాలు....
మూలవిరాట్ సంరక్షణ రెండూ ముఖ్యమే

ద్రాక్షారామ భీమేశ్వరాలయం 892-922 శతాబ్దం మధ్య నిర్మించినట్లు శాసనాలు చెబుతున్నాయి. పురాతన కట్టడంగా కేంద్ర పురావస్తుశాఖ పర్యవేక్షణలో సంరక్షింపబడుతుంది. పురావస్తు సంపదను భావితరాలకు అందించాలనే ధ్యేయంతో పురావస్తుశాఖ కృషి చేస్తోంది. భక్తులు భీమేశ్వరునికి అభిషేకాలు నిర్వహించి స్వామి కరుణాకటాక్షాలు పొందాలని పరితపిస్తుంటారు. ఈనేపథ్యంలో భక్తులు మనోభావాలు దెబ్బతినకుండా.. మూలవిరాట్ రూపం సంరక్షించేలా పీఠాధిపతులు, దేవదాయశాఖ అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మరికొద్దిరోజుల్లో స్వామివారి ఆలయం తెరిచి భక్తులకు దర్శనాలు, పూజలకు అవకాశం ఇవ్వనున్నారు. ఈలోగా అందరూ కలిసి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుని ఖచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

గ్రహణం మొర్రి ఉందని
తుప్పల్లో పడేశారు!

ఒంటిమామిడి గ్రామంలో తుప్పల్లో ఆడ శిశువు

గుర్తించి రక్షించిన స్థానికులు



తొండంగి, జూలై 15: గ్రహణం మొర్రితో పుట్టిందనే కారణంతో ఓ పసిపాపను తుప్పల పాల్జేశారు..బంధాన్ని మరిచి కర్కశంగా వ్యవహరించారు. తొండంగి మండలం ఒంటిమామిడిలో ఈ బాధాకరమైన ఘటన జరిగింది. ఆదివారం రాత్రి ఒంటిమామిడి గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు సమీపంలో చీరను చుట్టబెట్టి ఆడ బిడ్డను గుర్తు తెలియని వ్యక్తులు తుప్పల్లో వదిలి వెళ్లారు. సెంటర్‌లో చికెన్ షాపు నిర్వహించుకునే లోవరాజు అనే వ్యక్తి అక్కడ తనకున్న పాక వద్దకు వెళ్లగా తుప్పల్లోంచి పాప ఏడుపు వినబడింది. వెంటనే అక్కడకు వెళ్లి చూడగా గ్రహణం మొర్రితో ఉన్న పండంటి ఆడబిడ్డ కనిపించింది. విషయాన్ని సర్పంచ్ అంగులూరి సుధాకర్‌కు తెలపడంతో వెంటనే అక్కడకు చేరుకున్న ఆయన పోలీసు, రెవెన్యూ, ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో పోలీసులు, సర్పంచ్ పర్యవేక్షణలో బిడ్డకు ప్రాథమిక చికిత్స అందించి ఆశ వర్కర్లు అంగన్వాడీల సహాయంతో 108 అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కేవలం రోజుల వయసున్న బిడ్డకు గ్రహణం మొర్రి ఉండడంతో భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు వస్తాయని మూర్ఖంగా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. స్థానికంగా ఉన్న వ్యక్తులే ఈ పనికి పాల్పడ్డారా లేదా దూరం నుంచి పాపను తీసుకువచ్చి వదిలివేసారా అనేది తేలాల్సి ఉంది. పాపను వదిలి వెళ్లిన ప్రాంతం నిర్మానుష్యంగా ఉండడంతో పాటు పందుల సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతమని స్థానికులు చెబుతున్నారు. లోవరాజు ఆ సమయానికి వెళ్లకపోతే ప్రమాదం జరిగి ఉండేదని అంటున్నారు. ప్రస్తుతానికి పాప ఆరోగ్యం బాగానే ఉన్నట్లు తెలిసింది. గ్రహణం మొర్రి అనేక ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నా, ప్లాస్టిక్ సర్జరీలు లాంటి అడ్వాన్స్‌డ్ చికిత్సలు ఉన్నా ఇలా తుప్పలు పాలుచేయడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తొండంగి ఎస్ఐ వినయ్ ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.1.23 కోట్లు

ఆత్రేయపురం, జూలై 15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, పి.కామేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. 33 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.86,25,835, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.37,04,021 మొత్తం రూ.1,23,29,856 ఆదాయం లభించింది. 21 గ్రాముల బంగారం, కిలో వెండి, పలు దేశాల కరెన్సీ లభించినట్లు ఆలయ ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,96,819 లభించింది. లెక్కింపులో బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో నగదు చోరీ

గొల్లప్రోలు రూరల్, జూలై 15: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ నుంచి నగదు చోరీకి గురయింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన ఇంటి అమరావతి తన సోదరి దగ్గర తీసుకున్న డబ్బులను తిరిగి ఇచ్చేందుకు గానూ రూ.70వేలు బ్యాగులో పెట్టుకుని సోమవారం పిఠాపురం వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఇదే ఆటోలో చేబ్రోలులో ఇద్దరు మహిళలు ఎక్కారు. పిఠాపురం అని చెప్పిన మహిళలు ఇద్దరు గొల్లప్రోలులో దిగిపోయారు. పిఠాపురంలోని సోదరి ఇంటి వద్దకు వెళ్లి చూసుకునేసరికి బ్యాగులో ఉండాల్సిన రూ.70 వేలు లేకపోగా బ్యాగు కోసి ఉన్నట్లు గుర్తించారు. ఆటోలోకి చేబ్రోలులో ఎక్కిన మహిళలే ఈ చోరీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్ నిర్వహించారు. విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు, చార్జిషీటు ఫైల్ చేయడంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బెయిలు/జామీను విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సంబంధిత అధికా రులకు తగిన సిఫార్సులు చేశారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లతాకుమారి

ప్రత్తిపాడు, జూలై 15: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం వద్ద 60 కిలోలు గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను ప్రత్తిపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ గంజాయి విలువ మార్కెట్‌లో రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి వివరాలను వెల్లడించారు. పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు మండలంలోని ధర్మవరం శివారు తమ్మయ్య చెరువు వద్దషెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.3 లక్షలు విలువ చేసే 60 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సింహాద్రిపురం గ్రామానికి చెందిన కందా సూర్యనారాయణ, ధర్మవరం గ్రామానికి చెందిన ఒనుం ఏసుబాబులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీన పరుచుకుని గంజాయిని సీజ్ చేశారు. ఈ సంఘటనలో సింహాద్రిపురం గ్రామానికి చెందిన మొగిలి మణికంఠ పరారీలో ఉన్నట్లు పెద్దాపురం డీఎస్పీ తెలిపారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకొచ్చి ధర్మవరం శివారు తమ్మయ్య చెరువు వద్ద ఉన్న షెడ్‌లో అక్రమంగా నిల్వ చేసి నిందితులు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారని వారిని సీఐ శేఖర్ బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ బృందం ఆదివారం దాడి చేసి అదుపులోకి తీసుకుందన్నారు. చాకచక్యంగా గంజాయి గుట్టును రట్టు చేసిన సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

భార్యను హతమార్చిన వ్యక్తికి జీవితఖైదు

కె.గంగవరం, జూలై 15: మద్యం సేవించి భార్యను చిత్రహింసలకు గురిచేయడమే కాకుండా ఆమెను హత్య చేసిన వ్యక్తికి జీవితఖైదు విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని పామర్రు ఎస్ఐ కె.జానీబాషా చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం తామరపల్లి గ్రామానికి చెందిన గుత్తుల భవానీకి కపిలేశ్వరపురం మండలం నాగులచెరువు గ్రామానికి చెందిన మేడిశెట్టి శ్రీనుకు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. శ్రీను ఏవిధమైన పని చేయకుండా భార్య చేసిన కూలి డబ్బులపై ఆధారపడుతూ మద్యం సేవించి భవానీని హింసించేవాడు. దీంతో భవాని తండ్రి శేషారావు తన కుమార్తెను ఇంటికి తీసుకువచ్చేశాడు. సుమారు మూడు నెలల తర్వాత తాను మారానని శ్రీను మామగారికి నచ్చచెప్పి, తామరపల్లి గ్రామంలో భార్యతో కలిసి వేరు కాపురం పెట్టాడు. 2021 అక్టోబరు 13న శేషారావు కూలి పనికి వెళ్లి వచ్చి తమ కుమార్తె ఇంటికి తాళం వేసి ఉండటం గమనించాడు. తాళం పగలకొట్టి చూస్తే భవాని రక్తపు మడుగులో చనిపోయి ఉంది. దీనిపై అప్పుడు పామర్రు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కె.చిరంజీవి కేసు నమోదు చేశారు. శ్రీనును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. రాజమహేంద్రవరం కోర్టులో వాదోపవాదనలు అనంతరం నేరం రుజువు అయ్యింది. జడ్జి డి.విజయ్‌గౌతమ్ నిందితుడికి జీవితఖైదు, రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు.

వ్యాన్ ఢీకొని ఇద్దరి మృతి



దుర్గారావు, వెంకటేశ్వరరావు మృతదేహాలు



జక్కం వెంకటేశ్వరరావు



గండి దుర్గారావు

రాజానగరం/దివాన్‌చెరువు, జూలై 15: రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జి.యర్రంపాలెం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. రాజానగరం మండలం పాతతుంగపాడు గ్రామానికి గండి దుర్గారావు(32), కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన జక్కం వెంకటేశ్వరరావు (35) మోటార్‌సైకిల్‌పై దుళ్ల నుంచి పాతతుంగపాడు పయనమయ్యారు. మార్గమధ్యంలో జి.యర్రంపాలెం సమీపానికి వచ్చే సరికి ఎదురుగా టాటాఏస్ వ్యాన్ వీరిని బలంగా ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. స్థానికులు గమనించి వాహనాన్ని ఆపారు. కాగా దుర్గారావు అత్త వారి ఊరు దుళ్లలో ఉంటూ తాపీ పనిచేస్తున్నాడు. తుంగపాడులో అరటి తోట కౌలుకు తీసుకున్నాడు. అరటి గెలలు కోసేందుకు దుళ్ల నుంచి వెంకటేష్‌ను వెంట బెట్టుకుని వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కాగా దుర్గారావుకు ఓ కుమార్తె ఉండగా భార్య ప్రస్తుతం గర్భిణి. వెంకటేష్‌కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే పాతతుంగపాడుకు చెందిన పలువురు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజానగరం ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దుళ్లలో విషాదఛాయలు

కడియం, జూలై 15: తుంగపాడులో జరిగిన ప్రమాదంలో దుళ్ల గ్రామానికి చెందిన జక్కం వెంకటేశ్వరరావు, గండి దుర్గారావు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే వారే. వారి మృతితో ఆ కుటుంబాలు ఆధారాన్ని కోల్పోయాయి. జక్కం వెంకటేశ్వరరావుకు భార్య విజయలక్ష్మి, ఇంటర్ పాసైన కుమార్తె లీలా నాగదివ్య, పదో తరగతి చదువుతున్న శశిధర్ ఉన్నారు. గండి దుర్గారావుకు భార్య నాగలక్ష్మి, ఒకటో తరగతి చదువుతున్న కుమార్తె సంధ్యాదేవి ఉన్నారు. ప్రస్తుతం దుర్గారావు భార్య నాగలక్ష్మి 6 నెలల గర్భిణి.

ఇన్‌స్టాలో పరిచయం

యువకుడితో వెళ్లిపోయిన 17ఏళ్ల అమ్మాయి

20 గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఓ 17ఏళ్ల బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయి రాష్ట్రం దాటేసింది. ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు 20 గంటల్లో ఆచూకీ కనిపెట్టేశారు. సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఓ అపార్టుమెంటులో కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో ఒక కుటుంబం నివసిస్తోంది. పెద్ద కుమార్తె ఇంటర్ వరకూ చదువుకుంది. అయితే ఈ నెల 11న ఉదయం ఇంట్లో వాళ్లు నిద్రలేచే సరికి ఆమె కనిపించలేదు. వాకబు చేసినా ఫలితం లేక అదేరోజు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐ బి.వినోద్ తమ సిబ్బందితో రంగంలోకి దిగి గాలింపు ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా రైల్వే స్టేషన్‌లోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. 11వ తేదీ తెల్లవారుజామున 4 గంటల సమయంలో బాలిక, ఓ యువకుడు రైల్వే స్టేషనుకు వెళ్లి విశాఖ వైపు వెళ్లే గరీబ్‌రథ్ ఎక్కినట్లు గుర్తించారు. సాంకేతిక సహాయంతో అక్కడి నుంచి గుజరాత్‌లోని అహ్మదాబాద్ వెళ్లే రైలులో వెళుతున్నట్టు తెలుసుకున్నారు. వెంటనే అక్కడి రైల్వే భద్రతా దళం(ఆర్పీఎఫ్) పోలీసులను, బాలిక బంధువులను అప్రమత్తం చేశారు. 12న మధ్యాహ్నం బాలిక, యువకుడు అక్కడ దిగిన వెంటనే ఆర్పీఎఫ్ పోలీసులు వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇక్కడి నుంచి బాలిక తండ్రి, పోలీసు బృందం అహ్మదాబాద్ వెళ్లి వాళ్లిద్దరినీ సోమవారం రాజమహేంద్రవరం తీసుకొచ్చారు. మధ్యప్రదేశ్‌లోని దామో జిల్లా వైశాలి నగర్‌కి చెందిన 19ఏళ్ల యాష్ అగర్వాల్‌తో ఈ బాలికకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడిందని డీఎస్పీ చెప్పారు. బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించి అగర్వాల్‌ను అరెస్టు చేశామని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల విషయంలో పిల్లలను గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. కేసును త్వరితగతిన ఛేదించడంలో ప్రతిభ చూపిన డీఎస్పీ అంబికా ప్రసాద్, టూటౌన్ సీఐ వి.శ్రీనివాస్, ఎస్ఐ బి.వినోద్, హెచ్‌సీ వై.మహేశ్వరరావు, పీసీలు వీరబాబు, కె.ప్రదీప్ కుమార్‌ను ఎస్పీ జగదీశ్ అభినందించారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం

ఇద్దరిపై కేసు నమోదు

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారనే ఫిర్యాదుతో ఇద్దరు వ్యక్తులపై ప్రకాశంనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సత్యనారాయణ తెలిపిన, ఎఫ్ఐ ఆర్‌లోని వివరాల ప్రకారం.. పోస్టల్ కాలనీకి చెందిన తురాల శ్రీనివాస్ యాదవ్ కుమార్తె శిరీషా యాదవ్‌కి ఈ ఏడాది మార్చి 20న 77299 48662 నంబరు నుంచి ఒక మేసేజ్ వెళ్లింది. దీనిపై విచారించగా గుత్తుల మురళీ కృష్ణ, కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వైరిచర్ల ఉదయ భాస్కర్ అదే మెసేజ్‌లు పోస్ట్ చేసినట్టు తెలిసింది. బాధితుడు శ్రీనివాస యాదవ్ ఎస్పీకి ఫిర్యాదు చేయగా ప్రాథమిక విచారణ అనంతరం ఆదివారం రాత్రి ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో 'రాత'కు ప్రథమ స్థానం

పోర్టు సిటీ (కాకినాడ), జూలై 15: అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో 'రాత' నాటిక ప్రథమస్థానం కైవసం చేసుకుంది. కళాపరిషత్ 40వ వార్షికోత్సవంలో భాగంగా గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా సోమవారం వివరాలను కళాపరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అచ్యుతరామారెడ్డి, పంపన దయానందబాబు వెల్లడించారు. వెలగలేరుకు చెందిన థియేటర్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన ఈ నాటిక ప్రథమస్థానం సాధించిందన్నారు. పోలుదాసు శ్రీనివాసరావు రచన, దర్శకత్వం వహించారు. ద్వితీయ, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా స్వప్నం రాల్చిన అమృతం, విముక్తి నాటికలు నిలిచాయి. ఉత్తమ దర్శకుడిగా పోలుదాసు శ్రీనివాసరావు, ఉత్తమ నటిగా జ్యోతిరాణి, ఉత్తమ నటుడుగా జీవీ మనోహర్ బహుమతులు పొందారు. ఉత్తమ సంగీత దర్శకుడిగా నాగరాజు, ఉత్తమ విలక్షణ నటుడిగా వి.నాంచారయ్య బహుమతులు సాధించారని వివరించారు.

54 టెస్టులతో నీటి నాణ్యతను పరిశీలించాలి

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల పరిధిలో ప్రజలకు సరఫరా చేసే మంచినీటికి సంబంధించి వివిధ దశల్లో మొత్తం 54 టెస్టులు చేసి ఆ నీటి పరిస్థితిని నిర్ధారించాలని పబ్లిక్ హెల్త్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ ఎ.సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మునిసిపాలిటీలకు సోమవారం ప్రత్యేక సూచనలు చేశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్టు తెలిపారు. తమ సర్కిల్ పరిధిలో రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్లు, 18 మునిసిపాలిటీలు, 3 నగర పంచాయతీలు ఉన్నాయని, వాటి పరిధిలో రోజూ సుమారు 285 మిలియన్ లీటర్ల శుభ్రపరిచిన తాగునీటిని సరఫరా చేస్తామని, మరో 59 ట్యాంకర్ల ద్వారా 376 ట్రిప్‌లతో అదనంగా 1.8 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామాల నుంచి నగర పంచాయతీలకు మారిన వాటిలో పైపులైన్ల సమస్య ఉందని, మిగతా చోట్ల కూడా పాత పైపులైన్లను తీసేసి కొత్తవి వేయాలని గతంలోనూ సూచించినట్టు చెప్పారు. వర్షాకాలంలో పైపులైన్ల లీకుల వల్ల మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. మంచినీటిని వ్యాధికారక లక్షణాలు, ఇతర లోపాలు నిర్ధారించడానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసెడ్యూర్స్ (ఎస్ఓపీ) గైడ్‌లైన్స్‌ను తమ ఈఎన్‌సీ జారీ చేసిందన్నారు. వాటి ప్రకారం ఫిజికల్, కెమికల్, బ్యాక్టీరియోలాజికల్, హెవీ మెటీరియల్, పెస్టిసైడ్స్ వంటి ఐదు విభాగాల్లో మొత్తం 54 రకాల పరీక్షలు చేయాలన్నారు. ఫిజికల్ విభాగంలో ప్రతి రోజూ ఆరు రకాల పరీ క్షలు చేయాలన్నారు. భూగర్భజలాలు, బోరు బావులు, చేతిపంపులు, ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో నెలకోసారి ఈ పరీక్షలు చేయాలని సూచించారు. కెమికల్ విభాగంలో 12 రకాల టెస్టులు ఉంటాయని తెలిపారు. బ్యాక్టీరియాకోలి టెస్ట్ వారానికొకసారి చేయాలని చెప్పారు. హెవీమెటీరియల్ విభాగంలో 21 రకాల టెస్టులు చేయవలసి ఉంటుందని తెలిపారు. మూడు నెలలకొకసారి పరీక్షలు నిర్వహించి నిర్ధారించుకోవాలన్నారు. ఇక పెస్టిసైడ్స్ విభాగంలో 14 రకాల టెస్టులు మూడు నెలలకోసారి చేయాలన్నారు. ఆర్గో క్లోరైడ్స్‌కు సంబంధించిన 5 పరీక్షలు ఉంటాయని, వాటిలో మిథైల్ పారాథీన్, మిలాథిన్, క్లోర్పైపోస్, ఈథిన్, మోనోక్రోటోఫస్ వాటి పరీక్షలను మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని తెలిపారు.

నిర్వాసితులకు పునరావాస కల్పనకు చర్యలు

పోలవరం ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

అమలుకు గ్రామాల వారీగా కమిటీలు

రంపచోడవరంలో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్



కలెక్టర్‌ను ఎత్తుకుని తీసుకువస్తున్న గిరిజనులు

రంపచోడవరం, జూలై 15: 'పోలవరం' నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళ వందనంతో కలిసి పోలవరం ప్రాజెక్టు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన పోలవరం ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుకు గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముంపు బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. భూమికి భూమి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అంబేడ్కర్, మమ్మీ, తహశీల్దార్లు చలపతిరావు, సులోచన, డీటీలు కుమారి, కృష్ణశాస్త్రి, ప్రజ్ఞ, చిరంజీవి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అర్జీల వెల్లువ

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అల్లూరి జిల్లా కొత్త కలెక్టరు దినేష్ కుమార్ అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఏజెన్సీ నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ముఖ్యంగా పోలవరం నిర్వాసితులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. అర్జీల స్వీకరణ కార్యక్రమానికి కొత్త కలెక్టర్ రావడంతో అర్జీదారులు అధిక సంఖ్యలో తమ సమస్యలను చెప్పుకునేందుకు గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ జాన్‌రాజ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి, డ్వామా పీడీ ఎం.శివయ్య, ఏఎంవో సి.శ్రీహరి, జిల్లా వ్యవసాయాధికారి నందు, వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, డీడీ షరీఫ్, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, డీఎల్‌పీవో రఘునందన్, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, సర్వే ఇన్‌స్పెక్టర్ కె.దేవేంద్రుడు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అపూర్వ స్వాగతం

అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ రంపచోడవరంలో అఖండ స్వాగతం లభించింది. సంప్రదాయ నృత్యాలతో గిరిజనం ప్రేమతో నూతన కలెక్టర్‌కు ఆహ్వానం పలికారు. భుజాలకెత్తుకుని ఆయనను కొద్ది దూరం తీసుకువచ్చారు. గతంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన ఆయన ఇక్కడి గిరిజనుల మన్ననలు పొందారు. ఇప్పుడు అల్లూరి జిల్లా కలెక్టర్‌గా తమ ప్రాంతానికి రావడంతో రంపచోడవరం ప్రారంభం నుంచి ఆయనను ఊరేగింపుగా గిరిజనులు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ రంపచోడవరం మండలం ఐ.పోలవరంలోని టీటీడీ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, గిరిజన సంఘాల నాయకులు వెదుళ్ల లచ్చిరెడ్డి, పండా చెల్లన్నదొర, వై.నిరంజనీదేవి పాల్గొన్నారు.

పోశమ్మగండి వద్ద బోట్ల ప్రయాణం నిషేధం

దేవీపట్నం, జూలై15: మండలంలోని పోశమ్మగండి వద్ద వరద ఉధృతిని సోమవారం రంపచోడవరం సీఐ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గోదావరిలో బోట్లపై ప్రయాణం మానుకోవాలని, చేపల వేటకు వెళ్లరాదని పలు సూచనలు చేశారు. గోదావరి పెరుగుతున్న కారణంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

12 అడుగుల కొండ చిలువ హతం



ప్రత్తిపాడు, జూలై 15:మండలంలోని ఒమ్మంగి గ్రామంలో సోమవారం 12 అడుగుల కొండ చిలువను స్థానికులు హతమార్చారు. ఒమ్మంగి గ్రామానికి చెందిన రైతు కొండపల్లి శ్రీనివాస్ పొలంలో కొండ చిలువ కలియ తిరుగుతుండటంతో పొలంలో పని చేస్తున్న వ్యవసాయ కూలీలు గుర్తించి దానిని హతమార్చారు. 12 అడుగుల పొడవు ఉన్న ఈ కొండ చిలువను చూసేందుకు ఆసక్తిగా పొలానికి తరలివచ్చి తిలకించారు.

ట్రిపుల్ ఐటీకి ఏడుగురు విద్యార్థుల ఎంపిక

అయినవిల్లి, జూలై 15: కొండుకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. కొప్పిశెట్టి శిరీష, పళ్ల వెంకటసత్య సింధూజ, నల్లా రజనీసత్యసూర్యతేజ, నక్కా చేతనస్వరూప్, జాలం సాయిచంద్ర నూజివీడు ట్రిపుల్ ఐటీకి, చింతలపూడి గీతాంజలి, నక్కా దీపక్‌లు ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు వట్టికూటి శ్రీహరి తెలిపారు. సోమవారం విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సర్పంచ్ మేడిద దుర్గాప్రసాద్ అభినందించారు.

మండలాభివృద్ధికి సహకారం అందించండి

ఉప్పలగుప్తం, జూలై 15: మండలాభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు. మొదటిసారి మండలానికి వచ్చిన కలెక్టర్‌ను సోమవారం జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాదే శ్రీనివాసరావు, ఉప్పలగుప్తం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు కలిసి మండల సమస్యలను వివరించారు. కలెక్టర్‌ను సన్మానించారు. సర్పంచ్‌లు పెయ్యల రాజ్‌కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావ పాల్గొన్నారు.

విద్యా కిట్లు పంపిణీ

అంతర్వేది, జూలై 15: సఖినేటిపల్లి మండలంలోని పదహారు గ్రామాల పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన స్టూడెంట్ కిట్లను సోమవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అందించారు. కేశవదాసుపాలెం, మోరిపోడు, సఖినేటిపల్లి గీతామందిరం తదితర పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ సభ్యులు ఉండపల్లి సాయికుమారిఅంజి, కట్టా వెంకాయమ్మ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజోలు: బి.సావరంలోమండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ కడియం రమాదేవి విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను సోమవారం పంపిణీచేశారు. ఉపసర్పంచ్ రావూరి నాగబాబు, కడియం పూర్ణచంద్రరావు, కంచి వెంకటరమణ, బత్తుల లక్ష్మణ్, విద్యాకమిటీ చైర్మన్ దుర్గాదేవి, హెచ్‌ఎం కె.శకుంతల, దొంగ సత్యనారాయణ, గటిగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోటిపల్లి రేవును నిబంధనల ప్రకారం నిర్వహించాలి

కె.గంగవరం, జూలై15: కోటిపల్లి-ముక్తేశ్వరం ఫెర్రీరేవులో నిబంధనల ప్రకారం రాకపోకలు నిర్వహించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. రెండు పంటులు ద్వారా ప్రయాణికులను రేవు దాటించాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కటే పంటునే ఉపయోగిస్తున్నారు. ధరల పట్టిక అందుబాటులో లేదు. పరిమితికి మించి జనాన్ని ఎక్కిస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. సోమవారం రేవు దాటుతున్న మేడిశెట్టి ఇజ్రాయిల్ దీనిపై ఆర్డీవోకు ఫిర్యాదు చేశామన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈసమస్యపై దృష్టిసారించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

అంబేడ్కర్ జీవిత విశేషాలపై నాటక ప్రదర్శన

రాజోలు, జూలై15: రాజోలులో ఆగస్టు 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత విశేషాలపై నాటక ప్రదర్శన జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా తెలిపారు. ఈసందర్భంగా రాజోలులో సోమవారం రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు చెందిన దళిత నాయకుల సమావేశం అయ్యాజీవేమా ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈనాటక ప్రదర్శనకు అధికసంఖ్యలో ప్రజలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు, దండోరా నాయకులు, దళిత చైతన్యవేదిక నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు, ఎస్సీ సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ల్యాప్‌టాప్స్ అందజేత

అమలాపురం టౌన్, జూలై 15: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో ఐదుగురు దివ్యాంగులకు జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందజేశారు. డిగ్రీతో పాటు ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు సంక్షేమశాఖ అధికారి నారాయణమూర్తి, చైర్మన్ వై.శ్రీరామ్ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌లు అందించారు.

కామరాజ్ నాడార్ జయంతి వేడుకలు

యానాం, జూలై15: స్వాతంత్ర్య సమరయోధుడు కామరాజ్ నాడార్ జయంతి వేడుకలను యానాం సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానికఫెర్రిరోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఆర్‌ఏ కార్యాలయం సూపరింటెండెంట్ కాళ్ల సత్యనారాయణ నివాళులర్పించారు. సమాచారశాఖ అధికారి కె.ఎల్.వి.ప్రసాద్, మట్టపర్తి శ్రీను పాల్గొన్నారు.

శాకంబరిగా శారదాదేవి అమ్మవారు

యానాం, జూలై 15: స్థానిక గోపాల్‌నగర్‌లో ఉన్న శారదాదేవి ఆలయంలో అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకున్నారు. ఈనెల18న అమ్మవారికి భక్తుల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు సారె పెడతారు.

ప్రతీ విద్యార్థి ఉన్నత చదువులకు ప్రభుత్వం బాసట


అమలాపురం: బ్యాగ్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు.


ఐ.పోలవరం: బ్యాగ్ అందిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు,


మండపేట: బ్యాగ్ అందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- బ్యాగ్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, ఆనందరావు, దాట్ల బుచ్చిబాబు

అమలాపురం రూరల్, జూలై 15: ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివేందుకు కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. చదువుతోనే రాష్ట్ర, దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, విద్యార్థులంతా దీక్షతో చదువుకుని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని హెచ్‌ఎం మట్టపర్తి పురుషోత్తమరాజు అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులకు బ్యాగు, మూడు జతల ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, సాక్సులు, బెల్టుతో కూడిన కిట్లను ఎమ్మెల్యే విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశరావు, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, ఎంఈవో సరెళ్ల కనకదుర్గ, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, నాయకులు పెచ్చెట్టి చంద్రమౌళి, పెచ్చెట్టి విజయలక్ష్మి, మంథా ఫణికుమార్, చింతపల్లి శ్రీనివాస్, కడలిభాస్కరరావు, మొయిల శివ, వీరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశం అభివృద్ధి

ఐ.పోలవరం, జూలై15: విద్యతోనే కుటుంబం,రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ఐ.పోలవరం జడ్పీ హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్‌బ్యాగ్స్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. విద్యా రంగ సమస్యలపై ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే తనిఖీచేసి, అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకుడిని ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, సాగిరాజు సూరిబాబు రాజు, దాట్ల పృధ్వీ, కాకర్లపూడి రాజేష్, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, బీర సత్యకుమారి, పిన్నమరాజుశివ, గాదిరాజు బుచ్చి కృష్ణంరాజు, చేయ్యేటి శ్రీను, వీధి లోవరాజు, చిలుకూరి సుబ్బరాజు, హెచ్‌ఎం వీధి సురేష్ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్య

మండపేట, జూలై 15: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం విద్య అందిస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఉచిత విద్యతో పాటు మధ్యాహ్నభోజనం పథకం అమలు చేస్తోందన్నారు. స్థానిక పాలడుగు చంద్రమౌళి జడ్పీ బాలికల హైస్కూల్లో విద్యార్థులకు సోమవారం స్కూల్‌బ్యాగ్స్, పాఠ్య పుస్తకాలను ఎమ్మెల్యే వేగుళ్ల, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ అందించారు. ఎంఈవో-2 సీహెచ్‌వీ సోమి రెడ్డి, హెచ్‌ఎం కేవీఎం సరోజని, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషిచేయాలి

కపిలేశ్వరపురం, జూలై15: పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం నేలటూరు మెయిన్ పాఠశాలలో విద్యార్థులకు విద్యా కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో కె.తాతారావు, గ్రామసర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ రుద్రాక్షల సత్యగౌరి, వల్లూరు హైస్కూల్ హెచ్‌ఎం ఎంపీ లక్ష్మి, టీడీపీ అధ్యక్షులు రుద్రాక్షల సోమేష్, జనసేన పార్టీ అధ్యక్షులు నక్కా జనార్ధన్, పాఠశాల గౌరవ సలహాదారు పుట్టా దొరబాబు, కార్యదర్శి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ఆత్రేయపురం, జూలై15: ర్యాలి బుల్లియ్యరేవులో దేవస్థానానికి చెందిన 18ఎకరాల పొలంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఈస్థలాలను ఆనుకుని పంట కాలువను ఆక్రమించుకుని ఓ వ్యక్తి ఎటువంటి అనుమతి లేకుండా ప్రార్థనాలయం నిర్వహించేందుకు రేకుల షెడ్డు నిర్మించాడు. అక్కడ హిందువులు నివాసం ఉన్నారని, ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా చర్చిషెడ్డును తొలగించాలని సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దారు వెంకట్రామయ్య విచారణకు ఆదేశించారు.

మట్టి అక్రమ తవ్వకాలు ఆపాలి

కొత్తపేట, జూలై 15: కొత్తపేట తొగరపాయ వద్ద మట్టి అక్రమ తవ్వకాలను ఆపాలని సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొందరు గ్రామస్తులు ఆర్డీవో జీవీవీ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఇటీవలి కాలంలో తొగరపాయలో కొందరు అక్రమార్కులు బొండు ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తొగరపాయను ఆనుకుని ఉన్న శ్మశానవాటిక ప్రదేశాన్ని జంగిల్ క్లియరెన్స్ చేసి చెత్తను తొలగించాలని కోరారు. డీఎల్పీవో రాజేశ్వరరావు, తహసీల్దారు జి.ఎలీషా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీసుబ్బాలమ్మ తల్లికి సారె

అమలాపురం టౌన్, జూలై 15: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మ తల్లికి సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. గండు వీధిలోని శ్రీశేషశయన మందిరం వద్ద నుంచి ఊరేగింపుగా మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీసుబ్బాలమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకున్నారు. సంప్రదాయబద్ధంగా అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో జోన్ ధర్మప్రచారక్ జగన్నాథం, నగర్ కన్వీనర్ ఆర్లపల్లి ముత్యం, సహ కన్వీనర్ కోన వెంకట్రాజు గురుస్వామి, ధర్మ ప్రచారక్ మేడిశెట్టి నాగభూషణం, డివిజన్ కన్వీనర్ ఆర్.పల్లంశెట్టి, సహకన్వీనర్ ఎం.శ్రీరామ్, అధిక సంఖ్యలో మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

అంబాజీపేట, జూలై 15: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించి నాణ్యమైన దిగుబడులు సాధించాలని ఉమ్మడి జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ జె.ఎలియాజర్ అన్నారు. అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం జర్మనీ సంస్థ వలమ్ అగ్రి ఆధ్వర్యంలో మండంలలోని పలు గ్రామాల్లో కార్బన్ ఉధారాల నియంత్రణపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎలియాజర్ మాట్లాడుతూ పంటలో విచక్షణ రహితంగా ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల భూమి సారం కోల్పోతుందన్నారు. ఆరోగ్యకరమైన పంటలను పండించాలన్నారు. సుస్థిర వ్యవసాయ కేంద్ర ప్రతినిధులు ఉదయ్, ప్రసంగి, అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రంప్రతినిధి అఖిలాయాద్, అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, రాధిక పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవలో మంత్రి సుభాష్

కె.గంగవరం, జూలై 15: కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం సుందరపల్లిలో దేవాలయాలను సందర్శించారు. నిర్మాణంలో ఉన్న సోమేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు శ్రీరెడ్డిసత్తిబాబు, టీడీపీ, జనసేన నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి అండర్-19 చెస్ పోటీలు

అమలాపురం టౌన్, జూలై 15: కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం విద్యానిధి పాఠశాలలో అండర్-19 బాలబాలికలకు చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. త్వరలో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాస్థాయి నుంచి నలుగురు బాలురు, నలుగురు బాలికలను ఎంపిక చేస్తామన్నారు. 2005 జనవరి 1 తర్వాత జన్మించిన వారు పోటీలో పాల్గొనేందుకు అర్హులన్నారు.

త్రయంబకేశ్వరాలయంలో హరీష్ పూజలు


బండారులంక త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో ఆశీర్వచనం తీసుకుంటున్న ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం రూరల్, జూలై 15: బండారులంకలోని శ్రీభువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వీరభద్రస్వామి గుడి సెంటర్లో చింతా అత్తిలింగం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో హరీష్‌కు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పూర్ణకుంభంతో మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు తోడ్కొనివచ్చారు. నందీశ్వరుడు, వినాయకుని పూజల అనంతరం త్రయంబకేశ్వరునికి మహా రుద్రాభిషేకం, భువనేశ్వరి మాతకు కుంకుమ పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు ఆయన నూతన వస్త్రాలను సమర్పించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, సర్పంచ్ పెనుమాల సునీత, నాయకులు బళ్ల వెంకటేశ్వరరావు, మాడా మాధవి, యాళ్ల సుబ్బలక్ష్మి, రాయుడు సారధి, కాశిన బాబి, గోళ్ల మల్లేశ్వరరావు, యినుమర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు. బండారులంక లోయర్ కౌశిక డ్రెయిన్ గట్టును ఆనుకుని నిర్వహిస్తున్న డంపింగ్ యార్డును ఎంపీ హరీష్ పరిశీలించారు. ఆ ప్రాంతమంతా చెత్తాచెదారంతో నిండిపోవడంతో దుర్గంధం, దోమల బెడదతో జీవించలేకపోతున్నామని స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

ఎంపీ ల్యాడ్స్ నిధులపై సమీక్ష

అమలాపురం టౌన్, జూలై 15: ఎంపీ ల్యాడ్స్ నిధులపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఎంపీ స్వగృహంలో పంచాయతీరాజ్ ఈఈ కె.చంటిబాబు ఆధ్వర్యంలో ఎంపీ ల్యాడ్స్ వినియోగంపై చర్చించారు. పూర్తిస్థాయిలో నిధులు వినియోగించి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఎంపీ సూచించారు. పార్లమెంటు సమావేశాల అనంతరం తిరిగి వచ్చేసరికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డీఈ అన్యం రాంబాబు, ఏఈలు చిన్నంరాజు, కొండలరావు, గంగాధర్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌కు అభినందనలు..

అంతర్వేది గ్రామస్తులు సోమవారం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ను సోమవారం ఆయన స్వగృహంలో కలుసుకుని అభినందించి సత్కరించారు. మాజీ సర్పంచ్ వనమాలి మూలాస్వామి, పల్లవపాలెం సర్పంచ్ ఒడుగు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిప్పల యామినీపద్మప్రియ-నరేష్‌కుమార్, కోలా నరసింహస్వామి, వనమాలి విజయప్రసాద్, లంకే తాతరాజు, రేవు నరసింహమూర్తి, పినపోతు నాగరాజు, కొల్లాటి శివకృష్ణలతో పాటు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కోసం పనిచేసే పార్టీలు టీడీపీ, జనసేన

కపిలేశ్వరపురం, జూలై 15: రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్ అన్నారు. సోమవారం అంగర పార్టీ కార్యాలయంలో రైతు విభాగం మండల నాయకుడు మత్సా గంగరాజుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014లో సీఎంగా చంద్రబాబు అంగరలో ఇచ్చిన హామీలపై సాక్షిలో వచ్చిన కథనాన్ని ఆయన ఖండించారు. అంగర గ్రామాభివృద్ధి కోసం అప్పుడిచ్చిన హామీలోభాగంగా చంద్రబాబు రూ.7కోట్లు ఆర్‌డీఎఫ్ నిధులు మంజూరుచేశారన్నారు. రూ4.70కోట్లతో గ్రామంలో రోడ్లు, డ్రైన్ నిర్మాణాలు జరిగాయన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మిగిలిన రూ.2.30కోట్ల నిధులను గాలిలో కలిపేసారన్న మాటవాస్తవం కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో రూ.1.23కోట్లతో 2.217కిలోమీటర్ల రోడ్డు, రూ.1.10కోట్లతో 2.123కిలోమీటర్ల డ్రైన్లు నిర్మాణాలకు అంచనాలు సిద్ధం చేశామన్నారు.

ప్రతీ విద్యార్థికి ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 15: చదువు పూర్తి చేసిన ప్రతీ విద్యార్థికి ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాసంశెట్టి సుబాష్ అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 20న స్థానిక వీఎస్ఎం కళాశాలలో వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ ఐటీ, ఫార్మసీ కంపెనీలు జాబ్‌మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులై వారికి 1,859 ఉద్యోగావకాశాలు కల్పిస్తాయన్నారు. జాబ్‌మేళాలో రిజిస్ట్రేషన్‌కు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, ఎంబీఏ, గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేషన్ తదితర విద్యార్హత కలిగి 35ఏళ్లలోపు నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. తనపేరు చెప్పి ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని, బదిలీలు చేయిస్తామని చెబితే తనకు సమాచారం ఇవ్వాలని లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్ పాల్గొన్నారు.



ఆర్యవైశ్య భవనానికి నిధులు మంజూరు చేయిస్తా

ఆర్యవైశ్యుల సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి వాసంశెట్టి సుబాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యంను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాళ్లకూరి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కంచర్ల చినభద్రరావు, గౌరవ అధ్యక్షుడు అఖిలాండ మూర్తి, శ్రీఘాకోళపు చిన్ని స్వామి, బలభద్రుని శేషగిరిరావు, సుతపల్లి వీరబాబు పాల్గొన్నారు.

టీచ్ టూల్ శిక్షణను సమర్ధవంతంగా నిర్వహించాలి

అమలాపురం రూరల్, జూలై 15: ఈనెల18నుంచి జిల్లావ్యాప్తంగా టీచ్ టూల్ శిక్షణను సమర్ధవంతంగా నిర్వహించాలని డీఈవో ఎం.కమలకుమారి పిలుపునిచ్చారు. అమలాపురం మండల విద్యా శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం టీచ్ టూల్ మాస్టర్ ట్రైనర్లు 20మందికి ఒక రోజు ఓరియంటేషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ శిక్షణ సమయంలో మొబైల్ ఫోన్ల నిషేధానికి చర్యలు తీసుకోవాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు అబ్జర్వర్లకు మంచి కంటెంట్ అందించాలన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో తొమ్మిది రోజుల శిక్షణ పూర్తి చేయాలన్నారు. జిల్లా అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో 415మంది అబ్జర్వర్లకు నాన్ రెసిడెన్షియల్ విధానంలో తొమ్మిది రోజులు శిక్షణ ఇస్తామని తెలిపారు. రామచంద్రపురం, అమలాపురంల్లోని మూడు కేంద్రాల్లో శిక్షణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సమావేశంలో సమగ్ర శిక్షా ఏపీవో ఎంఏకే భీమారావు, జిల్లా కో-ఆర్డినేటర్లు పి.వివేక్, ఎం.పూజ, ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి మాట్లాడారు.

ముంపులో వరి పొలాలు

అల్లవరం, జూలై 15: డ్రెయిన్ల నుంచి ముంపునీరు సరిగా దిగక మండలంలోని పలుగ్రామాల్లో పంట పొలాలు జలాశయాలుగా దర్శనమిస్తున్నాయి. జూలై మూడో వారం వచ్చినా వరి నాట్లు వేయలేని స్థితిలో రైతులు వున్నారు. ముంపుదెబ్బతో కొన్నిగ్రామాల్లో వరి నారుమడులు దెబ్బతిన్నాయి. కొమరగిరిపట్నం, బెండమూర్లంక, గూడాల, తాడికోన, అల్లవరం, తూర్పులంక, రెల్లుగడ్డ గ్రామాల్లో వేలాది ఎకరాల్లో వరి చేలు ముంపునీరు దిగక జలశయాలుగా మారాయి. రామేశ్వరంమొగలో ఇసుకమేట వేయడంతో డ్రెయిన్ల నుంచి నీరు సరిగా దిగట్లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వరినాట్లు వేయలేమని, పంటవిరామం తప్పదని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

అధ్వానంగా ఓడలరేవు ఓఎన్జీసీ రోడ్డు

అల్లవరం, జూలై 15: ఓడలరేవులో ఓఎన్జీసీ టెర్మినల్ రోడ్డు భారీ గోతులతో అధ్వానంగా ఉంది. ఈరోడ్డులో ఓఎన్జీసీ భారీ వాహనాలు నిత్యం తిరుగుతున్నా కనీస మరమ్మతులు లేక ప్రమాదభరితంగా మారింది. దీంతో ఓడలరేవు బీచ్‌కు వెళ్లే సందర్శకులు ఇబ్బందిపడుతున్నారు. 35ఏళ్లుగా ఈగ్రామం నుంచి చమురు ఉత్పత్తులు తరలిస్తూ రూ.లక్షల కోట్లు ఆర్జించిన ఓఎన్జీసీ, గెయిల్ అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఓఎన్జీసీ ఈగ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలన్న గ్రామస్తుల చిరకాల వాంఛ నేటికీ నేరవేరలేదు. కనీసం రహదారులనైనా బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ఓఎంజీ
శ్రీలలిత	: సారంగ దరియా
శేఖర్ స్క్రీన్-1	: కల్కి
శేఖర్ స్క్రీన్-2	: ---
రమా	: భారతీయుడు 2
గణపతి	: రౌడీ గ్యాంగ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ---

గ్రామాభివృద్ధికి సహకరించాలి

మామిడికుదురు, జూలై 15: అందరూ కలిసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి కోరారు. నగరం గ్రామసభ సమావేశం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి పీవీఎస్వీ ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో పలువురు మాట్లాడుతూ గెయిల్ సంస్థ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను నగరం గ్రామంలో అందించాలన్నారు. గెయిల్ మొబైల్ వ్యాన్ ద్వారా పంపిణీ చేస్తున్న మందులు పక్కదారి పడుతున్నాయన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటుకు అందరూ పార్టీలకు అతీతంగా సహకారం అందించాలని కోరారు. నగరంలోని ఓఎన్జీసీకి చెందిన సోలార్ ప్లాంటుకు పన్నువేసి పంచాయతీ ఆదాయం పెంచుకోవడానికి పాలకవర్గం కృషి చేయాలని పలువురు సూచించారు. కార్యక్రమంలో జాలెం సుబ్బారావు, జాలెం శ్రీనివాసరాజా, కోళ్ల సురేష్‌బాబు, బత్తుల సురేష్, రాయుడు శ్రీనివాస్, కొల్లాబత్తుల వెంకటరమణ, కడలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం

మలికిపురం, జూలై 15: విశ్వేశ్వరాయపురానికి చెందిన బింద్రాల పోసయ్య ప్రమాదవశాత్తూ మే నెలలో చెట్టుపై నుంచి పడి ప్రమాద స్థలిలోనే మృతి చెందాడు. మానవతామూర్తుల గ్రూపు సభ్యులు రూ.10వేలు సేకరించి నగదుతో పాటు నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లుబోయిన హెలీన, హరికృష్ణ, మోహనరావు మాష్టారు. రాపాక రత్నరాజు, కాజా నరసింహరావు, పళ్లపోతు జైదీప్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖ డీఈఈ బదిలీ

మండపేట, జూలై15: మండపేట గృహనిర్మాణ ఇన్‌చార్జి డీఈఈగా పనిచేసిన పి.కుమార్ కొత్తపేటకు బదిలీఅయ్యారు. రాయవరం మండల గృహనిర్మాణ శాఖ ఏఈ శ్రీనివాసరెడ్డి ఇన్‌చార్జి డీఈఈగా నియమితులయ్యారు.

ఎస్పీకి వీడ్కోలు సత్కారం

అమలాపురం టౌన్, జూలై 15: బదిలీపై వెళ్తున్న ఎస్పీ ఎస్.శ్రీధర్‌ను కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, ఎస్సీ సెల్ చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు, నాయకులు మీసాల బాబి, వి.దుర్గారావు, బత్తిన సురేష్, ఎన్.వెంకటరమణ, పి.నారాయణమూర్తి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు.

సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఐ.పోలవరం, జూలై 15:ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య అందించాలని, వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు హెచ్చరించారు. టి.కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా బుచ్చిబాబు మాట్లాడుతూ టి.కొత్తపల్లి ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానన్నారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే బుచ్చిబాబు, సభ్యులుగా నడింపల్లి సత్యనారాయణరాజు, కుదుళ్ల వీరబాబు, ముమ్మిడివరపు నాగరత్నంలను ఎన్నుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, దాట్ల పృధ్వీ, సాగిరాజు సూరిబాబు, కాకర్లపూడి రాజేష్, చెయ్యేటి శ్రీను, మాజీ ఎంపీపీ దాసరి జగదీశ్వరి, సాకా సీతాదేవి, దాట్ల బుచ్చికృష్ణంరాజు బొంతు శ్రీరాములు, డాక్టర్ దయానా పాల్గొన్నారు.

దుస్తులు అందజేత

మండపేట, జూలై 15: మండపేట మండలం తాపేశ్వరం గ్రామ మాజీ సర్పంచ్ రిమ్మలపూడి బుల్లెబ్బాయి 77వ జయంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు రిమ్మలపూడి సత్యనారాయణ సోమవారం తాపేశ్వరం పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రాజేశ్వరీశ్రీనివాస్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ నూని వీర్రాజు, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, కోరా శివ, రిమ్మలపూడి రామకృష్ణచౌదరి, సత్యనారాయణమూర్తి, చోడిశెట్టి రాంబాబు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బియ్యంలోడు ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

రాజోలు, జూలై 15: సోంపల్లి ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించే బియ్యం లోడు ట్రాక్టర్లు, లారీలను సోంపల్లి గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. ఈసందర్భంగా వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు మాట్లాడుతూ గోడౌన్‌కు వెళ్లే భారీ వాహనాల వల్ల సోంపల్లి శివాలయం వద్ద నుంచి ఎఫ్‌సీఐ గిడ్డంగుల వరకు పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయన్నారు. గోడౌన్ యజమానికి ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. గోతుల్లో పెద్దపెద్ద రాళ్లువేసి రోలింగ్ చేయకుండా వదిలేశారన్నారు. భారీ వాహనాలు, ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్డు అధ్వానంగా తయారైందని, ఎఫ్‌సీఐ గోడౌన్ల పర్మిషన్‌ను రద్దుచేయాలని డిమాండు చేశారు. వార్డుసభ్యులు కట్టా మోహన్‌దుర్గాప్రసాద్, సోంపల్లి కృష్ణ, నాయకులు కొంబత్తుల బాలయోగి, పొలమూరి శరత్‌బాబు, కాండ్రేగుల శ్రీను, విప్పర్తి నాని, గుర్రం రఘు, పోతుమూడి రవిపాల్గొన్నారు.

నరసింహస్వామి జన్మ నక్షత్ర, అష్టోత్తర పూజలు

అంతర్వేది, జూలై 15: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు కలశలను శిరస్సుపై ధరించి ఆలయ ప్రదక్షిణ అనంతరం అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం 108 కలశలకు అర్చకులు ప్రత్యేక పూజలుచేసి పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, స్థానాచార్యులు రంగాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మ్యాథ్స్ బేసిక్ వర్క్‌బుక్స్ పంపిణీ

కపిలేశ్వరపురం, జూలై 15: వెదురుమూడి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మ్యాథ్స్ బేసిక్ వర్క్‌బుక్స్ పంపిణీ చేశారు. మంత్రి ప్రగడ కుసుమకుమారి పుట్టినరోజు సందర్భంగా పూర్వవిద్యార్థి ద్వి భాష్యం వీరభద్రారావు, సోమసుందరమ్మల చిన్నకుమారుడు లెక్కలు సులువుగా చేయడానికి ఉపయోగపడేలా తయారుచేసిన ఈపుస్తకాలను 5నుంచి 10తరగతుల విద్యార్థులకు పంపిణీచేశారు.హెచ్‌ఎం కె.ఉమాదేవి, యూటీఎఫ్ నాయకులు డీవీ రాఘవులు, ముత్యాల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.51వేలు విరాళం

అంతర్వేది, జూలై 15: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రాజోలు మండలం పొదలాడకు చెందిన శిరిగినీడి ఆదినారాయణ-సత్యామణి దంపతులు రూ.51వేలు విరాళంగా అందించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

మాచవరం ఎస్సీ పేటలో అధ్వానంగా పారిశుధ్యం

రాయవరం, జూలై 15: మాచవరంలో స్థానిక దళితపేటలో సోమవారం డ్రైన్ పొంగి మురుగు నీరు ప్రవహిస్తుంది. రోడ్డుపై వ్యర్థాలు, చెత్తా చెదారం పేరుకుపోయి రోడ్డు అధ్వానంగా తయారైంది. ప్రతి రోజు విద్యార్థులు స్కూల్‌కు ఈరోడ్డులోనే వెళ్లాలి. అపారిశుధ్యంతో దోమలు పెరిగి డెంగీ వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి జరీనాను వివరణ కోరగా మురుగునీరు తొలగించి మెరుగైన పారిశుధ్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, జూలై 15: ఎన్.కొత్తపల్లి 11కేవీ, ఉప్పలగుప్తం ఇండస్ట్రియల్, ఆర్‌డబ్ల్యూఎస్ లైన్ల నిర్వహణ, ఇతర పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగు తుందని ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్, ఏఈ శ్రీహరిరావు తెలిపారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉప్పలగుప్తం, పేరాయిచెరువు, గొల్లవిల్లి, మునిపల్లి, చినగాడవిల్లి, పెదగాడవిల్లి, వానపల్లిపాలెం, ఎన్.కొత్తపల్లి, రాఘవులపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఓఎన్జీసీ ద్వారా నష్టపరిహారం అందించండి


హోంమంత్రి అనితను కలిసిన నామన

మామిడికుదురు, జూలై 15: సముద్రంలో వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఓఎన్జీసీ ద్వారా నష్ట పరిహారం ఇచ్చేలా చూడాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు మత్స్యకార నాయకులు వినతిపత్రం అందించారు. మంగళగిరిలో జడ్పీ మాజీ చైర్మన్ రాంబాబుతో కలిసి వెళ్లి మత్స్యకార నాయకులు వారి సమస్యలపై మాట్లాడారు. యానాం, ముమ్మిడివరం తదితర ప్రాంతాల్లో వేట విరామ సమయంలో ఓఎన్జీసీ సంస్థ పరిహారం అందిస్తుందని, అదే విధంగా కోనసీమ ప్రాంత మత్స్యకారులకు కూడా పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిహారం అందేలా కృషిచేస్తానని తెలిపినట్టు రాంబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా అగ్నికుల క్షత్రియ సాధికారసమితి అధ్యక్షుడు లంకే భీమరాజు, బీసీ సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు, కొల్లు విష్ణుమూర్తి, కోలా తాతరాజు, శేరు శ్రీను, కోలా రాంబాబు, వైదాడి పాండురంగారావు, అర్ధాని శ్రీను పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన జడ్పీ మాజీ చైర్మన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు సోమవారం పలువురు శాఖలకు చెందిన మంత్రులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో హోంమంత్రి వంగలపూడి అనిత, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రలను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఆయనతో పాటు పి.గన్నవరం టీడీపీ మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు, నామన శ్రీనివాస్, కోలా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.